కరెంట్ మోటార్ల చోరీపై ఆందోళన

- ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని కాచాపూర్ రైతుల ఆవేదన

జూలపల్లి: మోటార్ల దొంగలను పట్టుకోండి సారూ.. అంటూ మండలంలోని కాచాపూర్ రైతులు పోలీసులను విన్నవిస్తున్నారు. కొన్ని నెలలుగా వ్యవసాయ బావుల వద్ద ఉన్న మోటార్లను రాత్రికి రాత్రే చోరీ చేస్తున్నారని గతంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. కాగా గురువారం రాత్రి ఆరు మోటార్లను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లినట్లు రైతులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరినార్లు ఎదిగి నాటువేసే సమయంలో మోటార్లు చోరీకి గురవ్వడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, కావాలనే గుర్తు తెలియని వ్యక్తులు సీసీ కెమెరాలు వైర్లు కత్తిరించారని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా కరెంటు మోటార్ల దొంగలను పట్టుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



కాచాపూర్‌లో వ్యవసాయ బావి వద్ద చోరీకి గురైన మోటారు

నాలుగు మోటార్లు పోయాయి

కొన్ని నెలలుగా కరెంటు మోటార్లు చోరీకి గురవుతున్నాయి. నేను బావికి పెట్టుకున్న నాలుగు మోటార్లను రాత్రికి రాత్రే ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం నాటు వేసే సమయంలో గురువారం రాత్రి కరెంటు మోటారు ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసినం. దొంగలను పట్టుకొని మాకు న్యాయం చేయాలి. – కల్లెం తిరుపతిరెడ్డి, రైతు, కాచాపూర్



సుల్తానాబాద్: సుల్తానాబాద్ చుట్టుపక్కల ప్రాంతంలో వరినాటు వేసేందుకు కూలీలు ట్రాక్టర్లు, ఆటో ట్రాలీల్లో వెళ్ల వస్తున్నారు. అయితే జీవనోపాధి కోసం కూలీలు ప్రమాదమని తెలిసినా తప్పని స్థితిలో ప్రయాణిస్తున్నారు. ఆటో ట్రాలీల్లో పరిమితికి మించి ప్రమాదం అంచున ప్రయాణం చేస్తున్నారు. అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

సంకష్టహర చతుర్థి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో శుక్రవారం సంకష్ట హరచతుర్థి వేడుకలు జరిగాయి. ఆలయంలో అర్చకులు భార్గవశర్మ ప్రత్యేకాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. అలాగే ఎల్లమ్మ చెరువుకట్ట సమీపంలో స్వయంభూగా వెలసిన గణపతి ఆలయంలోనూ సంకష్టహర చతుర్థి వేడుకలను అర్చకులు సంపత్‌కుమార్ నిర్వహించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ పరిధి కేకేనగర్‌లో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో ప్రకృతి వైద్య అండ్ ఆక్యుపంక్చర్ హెల్త్ కేర్ సెంటర్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శరణ్య సిబ్బందితో కలిసి కంటి పరీక్షలు నిర్వహించారు. అంతరం ఉచితంగా మందులు అందజేశారు. కంటి పరీక్షలకు 67మంది హాజరుకాగా 27మందిని కంటి పరీక్షలకు ఎంపిక చేసినట్లు ప్రోగ్రాం ఇన్‌చార్జి బుర్ర ముత్యాలగౌడ్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

గోదావరిఖని: ఇటీవలి కాలంలో గుండెపోటు మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో గోదావరిఖని ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రెస్‌క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రామగుండం బ్రాంచి, సిగ్మా ఆసుపత్రి సంయుక్త సహకారంతో 18న ఉదయం10.30 గంటలకు సిగ్మా హాస్పిటల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరంలో బీపీ, ఆర్‌బీఎస్ (ర్యాండమ్ బ్లడ్ షుగర్), లిపిడ్ ప్రొఫైల్ (కొలెస్ట్రాల్ టెస్ట్), ఈసీజీ (గుండెకు సంబంధించిన) పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభ విజయవంతం చేయాలి



నాయకుల ప్రదర్శన

పెద్దపల్లిరూరల్: సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం కార్యదర్శి కల్లెపల్లి అశోక్ కోరారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద శుక్రవారం ఎర్రరంగు టీషర్టులు ధరించి ప్రదర్శన నిర్వహించారు. అమలు సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలన పూర్తయినా ఏం చేయలేకపోతోందని విమర్శించారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు గణేశ్, శ్రావణ్, ప్రశాంత్, నవీన్, వెంకటస్వామి, ఆదిత్య ఉన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడికి నివాళి



సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని సుద్దాలకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు ఎరబెల్లి రంగారావు గురువారం మృతి చెందారు. అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం నివాళి అర్పించారు. ఆయన పార్థివ దేహానికి ఆర్డీవో గంగయ్య జాతీయ జెండా కప్పి పూలమాల వేసి నివాళి అర్పించారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, స్వాతంత్య్ర సమరయోధుల వారసుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశం ఉన్నారు.

నియామకం

రామగుండం: మాల మహానాడు అంతర్గాం మండల యూత్ అధ్యక్షుడిగా తీగుట్ల నవీన్ ఎన్నికయ్యాడు. మహానాడు జిల్లా అధ్యక్షుడు దేవి లక్ష్మీనర్సయ్య శుక్రవారం నియామక పత్రం అందజేశారు.

మంథని గురుకుల టీచర్‌కు డాక్టరేట్

మంథని: మంథనిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం సోషల్ అధ్యాపకుడు సుధాకర్ రాజనీతి శాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందినట్లు కాకతీయ యూనివర్సిటీ నుంచి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్ఫామెన్స్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్ స్టేట్ ఏ కేస్ స్టడీ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్స్ అనే సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సుధాకర్ తెలిపారు.

మాతాశిశు ఆరోగ్య కేంద్రంపై నిర్లక్ష్యం

మంథని: మంథనిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని రెండు నెలలుగా స్త్రీ వైద్య నిపుణురాలు లేక పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. పట్టణంలోని మాతాశిశు ఆస్పత్రిని శుక్రవారం ఆయన సందర్శించి ఆయా వార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో ఎంత మంది డాక్టర్లు, సిబ్బంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. రెండు నెలలుగా గైనకాలజిస్ట్ వైద్యుల నియామకం జరగలేదని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిత్యం సీఎంతో కలిసి తిరుగుతున్న మంథని ఎమ్మెల్యే తన సొంత నియోజకవర్గ కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిలో ఒక వైద్యుడిని నియమించకపోవడం దురదృష్టకరమన్నారు. రెండునెలలుగా ఒక గైనకాలజిస్టును నియమించడంలో విఫలం అయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. తాము ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే వాటికి సరైన సమాధానం చెప్పకుండా కిందిస్థాయి నాయకులతో తనను దూషిస్తున్నారన్నారు. డాక్టర్ లేక గోదావరిఖని, కరీంనగర్ పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన వాపోయారు. ఎమ్మెల్యే స్పందించి మాతాశిశు ఆస్పత్రిలో వెంటనే వైద్యురాలిని నియమించి మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పుట్ట మధు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని పాఠశాల ప్రాంగణంలో తిరిగారు. అనంతరం తమకు చదువు చెప్పిన గురువులను పూలమాల, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం అందరూ సహపంక్తి భోజనం చేశారు. జాలపల్లి మహేశ్, కామెర రమేశ్, పాయిడి మహేశ్, రెడపాక శ్రీనివాస్, నరేశ్‌కుమార్, వెంకటస్వామి, రవి, బ్రహ్మం, గట్టయ్య పాల్గొన్నారు.

ఓదెలలో గొల్లపోశానికుంటకు గండి

ఓదెల: ఓదెల గ్రామంలో గొల్లపోశానికుంటకు శుక్రవారం గండిపడిందని గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఎస్సారెస్పీ కాలువనీటి ప్రవాహం కుంటలో చేరడంతో నిండుకుండలా మారింది. అకస్మాత్తుగా కుంటకు గండిపడింది. దీంతో కుంటకింద ఉన్న 7ఎకరాల ఆయకట్టు సాగుపూర్తిగా కొట్టుకుపోయింది. కుంటకింద ఇటీవల రైతులు వేసిన వరినాట్లు పూర్తిగా కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరినాట్ల తర్వాత కుంటకు గండిపడి కొట్టుకుపోవడంతో సాగు పెట్టుబడి నష్టపోయినట్లు వాపోయారు.

అంతర్‌జిల్లా కబడ్డీ పోటీల విజేత కుక్కలగూడూర్

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడూర్‌లో రెండురోజులుగా జరుగుతున్న అంతర్‌జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఇటీవల వెల్గ టూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన కుదిరె సాగర్, బడుగు సాగర్, నల్లపు అవినాష్ మృతిచెందారు. వారి స్మారకార్థం మిత్ర బృందం ఆధ్వర్యంలో గ్రామంలో కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల తదితర జిల్లాల పరిధిలో మొత్తం 40జట్లు పాల్గొన్నాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో జీస్టార్ టీం (కుక్కలగూడూర్), మంచిర్యాల జిల్లా అంకటపల్లి గ్రామ జట్టుపై గెలుపొంది విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.12,016, రన్నర్ జట్టుకు రూ.6016 నగదు బహుమతితో పాటు ట్రోఫీని పాలకుర్తి ట్రాన్స్‌కో ఏఈ మానాల ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఆర్గనైజర్లు సంజు, మనోహర్, దీపక్, రాజుకుమార్, కార్తీక్, వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు, గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందజేస్తున్న ట్రాన్స్‌కో ఏఈ ప్రసాద్

రైతుభరోసా, రేషన్‌కార్డుల జారీపై ఇంటింటా సర్వే

కాల్వశ్రీరాంపూర్: రైతు భరోసా, రేషన్‌కార్డుల జారీ కోసం శుక్రవారం ఎంపీడీవో రామ్మోహనా చారి ఇంటింటా సర్వే చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతీ లబ్ధిదారుని గుర్తించి జాబితా సిద్ధం చేస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు. సాగుకు యోగ్యం కాని భూములను, సాగు చేస్తున్న భూములను గుర్తిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయశాఖ ఉద్యోగులతోపాటు పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా సర్వే చేపడుతున్నట్లు తెలిపారు.

రేషన్‌కార్డు అర్హుల జాబితాపై రీసర్వే

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, విసంపేట, సోమనపల్లి గ్రామాల్లో ఇటీవల రేషన్‌కార్డు అర్హుల జాబితా రూపొందించేందుకు సర్వే చేసి జాబితాను సిద్ధం చేశారు. శుక్రవారం ఎంపీడీవో ఎంఏ.అలీం సదరు అర్హుల జాబితా ఆధారంగా గ్రామాల్లో క్షేత్ర పరిశీలన చేసి రీసర్వే చేపట్టారు. అనంతరం సర్వే చేపడుతున్న సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

కనగర్తిలో రైతుభరోసా సర్వే

ఓదెల: మండలంలోని కనగర్తి గ్రామంలో ఓదెల తహసీల్దార్ యాకయ్య, ఏవో భాస్కర్ ఆధ్వర్యంలో రైతుభరోసా సర్వేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగుచేసే భూముల వివరాలతో పాటు వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించినట్లు వారు పేర్కొన్నారు.

24న మాజీ ఎమ్మెల్యే బిరుదు విగ్రహం ఏర్పాటు

సుల్తానాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు విగ్రహం 24న ఏర్పాటు చేస్తామని మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ అన్నారు. పట్టణంలో విగ్రహ ఏర్పాటు స్థల పరిశీలనతో పాటు పనులను ప్రారంభించారు. విగ్రహ ఆవిష్కరణకు తరలి రావాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు గాజుల రాజమల్లు, శ్రీగిరి శ్రీనివాస్, రవీందర్, మహేందర్, రాధాకృష్ణ, రమేశ్, కుమార్ కిషోర్, పెద్దన్న, శ్రీనివాస్, రాజు, నారాయణ, వేణు పాల్గొన్నారు.

21 నుంచి గ్రామసభలు

రామగుండం: గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు అంతర్గాం ఎంపీడీవో ఎంఏ.అలీం తెలిపారు. గ్రామాల వారీగా గ్రామసభల నిర్వహణ తేదీలను శుక్రవారం ఆయన ప్రకటించారు. ఈనెల 21న ఆకెనపల్లి, సోమనపల్లి, గోలివాడ, టీటీఎస్ అంతర్గాం, మద్దిర్యాల, విసంపేట, 22న కుందనపల్లి, రాయదండి, పెద్దంపేట, లింగాపూర్, అంతర్గాం, బ్రాహ్మణపల్లి, 23న ఎగ్లాస్‌పూర్, పొట్యాల, ఎల్లంపల్లి, ముర్మూర్‌లో సభలు నిర్వహిస్తారు.

ముత్తారం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఈనెల 22, 23న గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీవో సురేశ్ తెలిపారు.

కమాన్‌పూర్: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న నాలుగు పథకాలను అమలు చేసి అర్హులైన వారికి అందించడానికి ఈ నెల 21 నుంచి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లలిత తెలిపారు. 21న నాగారం, సిద్దిపల్లె, పెంచికల్‌పేట, 22న గుండారం, గొల్లపల్లె, రొంపికుంట, పేరపల్లి, కమాన్‌పూర్, జూలపల్లిలో గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

ఓదెల: 21న కొమిర, బీమరిపల్లి, రూపునారాయణపేట, బాయమ్మపల్లి, ఉప్పరపల్లి, గుండ్లపల్లి, 22న అబ్బిడిపల్లి, లంబాడితండా, జీలకుంట, గూడెం, హరిపురం, పిట్టలఎల్లయ్యపల్లి గ్రామాల్లో, 23న ఓదెల, నాంసానిపల్లె, ఇందుర్తి, కొలనూర్, గోపరపల్లి, కనగర్తి, మడక, గుంపుల, శానగొండ, పొత్కపల్లి గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని ఓదెల ఎంపీడీవో జి.తిరుపతి పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **చికిత్స పొందుతూ ఒకరు మృతి**

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని మంచిరామికి చెందిన రాచర్ల వెంకటస్వామి(38) ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం వెంకటస్వామి ఏడాది క్రితం 10గుంటల భూమి కొనుగోలు చేయగా రూ.4లక్షల వరకు అప్పు చేశారు. వాటిని ఎలా తీర్చాలని మానసికంగా కుంగిపోగా 5న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు.

- **పలువురిపై కేసు నమోదు**

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శివారులో ఉన్న శ్రీవేంకటేశ్వర స్టోన్ క్రషర్‌కు వెళ్లే దారిని జేసీబీతో తవ్విన డ్రైవర్‌తో పాటు 8మందిపై స్టోన్ క్రషర్ యజమాని మంద అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం పెద్దాపూర్, కుర్మపల్లె గ్రామానికి చెందిన పెసరు పెద్దులు, రాజన్నల రాయలింగు, గట్టయ్య, ఎల్లయ్య, మల్లయ్య, శంకర్, రాజయ్య, బైరి కొమురయ్య క్రషర్‌కు వెళ్లాలంటే డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. ఇవ్వకపోవడంతో దారి తవ్వి అంజయ్యను చంపుతారని బెదిరించారు. దీంతో అతడు పోలీసులుకు ఫిర్యాదు చేశాడు. రోడ్డును తవ్విన వారితో పాటు జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

- **విద్యుదాఘాతంతో వస్తువులు దగ్ధం**

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకుల(మారుతినగర్)కు చెందిన గూడ ఉలియమ్మ–ఓదెలుకు చెందిన ఇంట్లో శుక్రవారం విద్యుత్ విద్యుదాఘాతంతో ఇంట్లోని వస్తువులు కాలిపోయాయని బాధితులు తెలిపారు. ఫ్రిడ్జి, టీవీ, ఫ్యాన్, బియ్యంతో పాటు ఇతర సామగ్రి కాలిపోయాయని చెప్పారు. దాదాపు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

- **ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర**

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను ప్రైవేటీకరించేందుకు కుట్రలు పన్నుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు ఆరోపించారు. పెద్దపల్లిలోని కార్యాలయంలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. 19న కార్మిక, కర్షక ఐక్యత దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.

- **చికిత్స పొందుతూ యువకుడి మృతి**

ముత్తారం: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బండ రామకృష్ణ (35) అనే యువకుడు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ నెల 9న రామకృష్ణ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

- **కుక్కలు, కోతుల బెడద అరికట్టాలి**

కోల్‌సిటీ: నగరపాలక సంస్థలో కుక్కలు, కోతుల బెడద తీర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు ఈదునూరి నర్సింగ్ కోరారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీకి శుక్రవారం వినతిపత్రం అందించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో రామగుండంలో కూడా వీధికుక్కల సంరక్షణ కేంద్రం ఏర్పాటు, హెల్ప్‌లైన్, వాట్సాప్ నంబర్ కేటాయించాలని కోరారు. బి–పవర్‌హౌస్ గడ్డ నుంచి గోదావరిఖనిలోని గంగానగర్ బ్రిడ్జి వరకు ఫ్లైఓవర్‌తోపాటు రోడ్లకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించాలని బీఆర్‌ఎస్ కార్పొరేషన్ సమన్వయ కమిటీ, బీసీసెల్ అధికార ప్రతినిధి మల్లేశం కోరారు.

- **ఇసుక ట్రాక్టర్ పట్టివేత**

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మానేరు నుంచి మంథనికి ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను సందరెల్లి ప్రాంతంలో పట్టుకొని ముత్తారం పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి నాగవెల్లి పట్నం



మొక్కులు చెల్లిస్తున్న ఆలయ కమిటీ, భక్తులు

ఎలిగేడు: మండలంలోని లాలపల్లిలో మల్లికార్జునస్వామి ఆలయంలో మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మల్లికార్జునస్వామి కేతమ్మ, మేడలమ్మల నాగవెల్లి పట్నాన్ని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అగ్నిగుండాలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరితోపాటు చుట్టపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు.

సింగరేణి వార్తలు

దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 దుర్గామాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తయి మండలకాల మహోత్సవం నిర్వహించిన పూజల్లో ఆర్జీ–2 జీఎం దంపతులు వెంకటయ్య–వనజ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ జీగురు రవీందర్, ఎస్‌వోటూ జీఎం రాముడు, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు, గని మేనేజర్ పాండే, గని రక్షణ అధికారి పాపయ్య, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ శ్యాంసన్, పిట్ సెక్రటరీ ఎజ్జ రాజయ్య, ఇతర అధికారులు, యూనియన్ నాయకులు, గని ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న జీఎం వెంకటయ్య

సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

గోదావరిఖని: విధి నిర్వహణలో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండి సంస్థ ఆస్తులను కాపాడాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య ఆదేశించారు. ఓసీపీ–3 ప్రాజెక్టు మెయిన్ ఔట్‌పోస్టు సెక్యూరిటీ గార్డు గదిని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అన్ని వసతులతో రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ జీగురు రవీందర్, డీజీఎం ఐఈడీ మురళీకృష్ణ, ఓసీపీ–3 గని మేనేజర్ పాండే, గని రక్షణ అధికారి పాపయ్య, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



ఔట్ పోస్టును ప్రారంభిస్తున్న జీఎం వెంకటయ్య

సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు శుక్రవారం జీఎం ఎన్.సుధాకర్‌రావు ఆదేశాల మేరకు క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. 175 ఖాళీ క్వార్టర్లు ఉండగా ఫ్రెష్ అలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ కోసం 61మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి తెలిపారు. 26 మంది ఉద్యోగులు హాజరై 21 మంది క్వార్టర్లు ఎంపిక చేసుకున్నారని, వారికి త్వరలోనే అలాట్‌మెంట్ లెటర్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్, ఎస్టేట్ అధికారి కె.ఐలయ్య, డీపీఎం గుర్రం శ్రీహరి, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, సాయికృష్ణ, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, సదయ్య పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

అవార్డు గ్రహీతలకు సన్మానం

గోదావరిఖని: రెస్క్యూ సిల్వర్ జూబ్లీ అవార్డు గ్రహీతలను రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. ప్రధాన రెస్క్యూ స్టేషన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. సింగరేణి రెస్క్యూ సర్వీసులో 25ఏళ్లు పూర్తి చేసుకుని జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో రెస్క్యూ సిల్వర్ జూబ్లీ అవార్డు తీసుకున్న సందర్భంగా చల్లా రవీందర్‌రెడ్డి, బత్తుల రమేశ్, మడికంటి శ్రీనివాస్, మహమ్మద్ ఖాసిం, కటుకూరి రవీందర్‌రెడ్డిని సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. రెస్క్యూ సూపరింటెండెంట్ బింగి మాధవరావు గారు, భాస్కర్‌రెడ్డి, నర్సింహామూర్తి, రెస్క్యూ సిబ్బంది జక్కుల కిషన్‌రావు, వి.కళాధర్, మురళీకృష్ణ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి

విధుల్లో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

రామగిరి: సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం ఒక వరమని, చెడు అలవాట్లకు బానిసై విధులకు గైర్హాజరు కావొద్దని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన 10మందికి కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులు శుక్రవారం అందజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ స్థాయికి తగ్గట్టుగా పనిచేస్తూ సూపర్‌వైజర్ల ఆదేశాలు పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు సీ.హెచ్.వెంకటరమణ, ఎస్‌వోటూ జీఎం గుంజపడుగు రఘుపతి, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, డీవైపీఎం సునీల్ ప్రసాద్ పాల్గొన్నారు.



నియామక పత్రం అందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

పొలందారి చదును చేయించిన అధికారులు

ముత్తారం: ముత్తారంలో ఎస్సారెస్పీ కాలువ నుంచి వ్యవసాయ భూమి సాగుకు వెళ్లడానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నామని బాధితుడు పరికిపండ్ల రాజమల్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసుశాఖ అధికారుల సమన్వయంతో శుక్రవారం దారిని చదును చేయించారు. దారికి అడ్డుగా ఉన్న గోడ, చెట్టును తొలిగించారు. ఎస్సారెస్పీ కాలువ, ఆర్అండ్‌బీ రోడ్డును ఆక్రమిస్తే చర్యలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. ఇరిగేషన్ డీఈఈ రాజేంద్రప్రసాద్, ఏఈ శేస్మాద్దీన్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ఉన్నారు.